- నేటి నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు
- తిరుమలలో సుప్రభాతానికి బదులు తిరుప్పావై పాటలు
- లక్ష్మీదేవి, నారాయణుడిని తులసీ దళాలతో పూజిస్తే సకల సంపదలు
- ముస్తాబవుతున్న వైష్ణవ ఆలయాలు


సంతాన వేణుగోపాల స్వామి ఆలయం


శ్రీ రంగ నాథ స్వామి

# ముక్తికిమార్గం.. ధనుర్మాసం

గద్వాల టౌన్, డిసెంబర్ 15 : శ్రావణ మాసం, మాఘమాసం, కార్తీకమాసంతో పాటు హైందవ సంస్కృతిలో ధనుర్మాసానికి కూడ పెద్దపీట వేశారు. ఈ మాసమంతా కూడా మహావిష్ణువును భక్తితో కొలుస్తారు. ఈనెల మొత్తం ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మి కరుణా కటాక్షాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. ఎన్నో విశిష్టతలు, ప్రత్యేకతలు ఉన్న ధనుర్మాసం సంక్రాంతి పండుగకు ముందు ప్రారంభమవుతుంది. ఆదివారం నుంచి జనవరి 16వ తేదీ వరకు ధనురాస్మం ఉంటుంది.

**ధనుర్మాసమంటే..**

ధనుర్మాసంలో ధనురాశిలోకి సూర్యుడు ప్రవేశించిన సమయం ధనుసంక్రమణం. ధనుస్సులో సుర్యుడుండే కాలం ధనుర్మాసం. గోదాదేవి కథ ఈ మాసానికి సంబంధించినదే కావడం వల్ల తిరుప్పావై పఠనం, గోదాదేవి కల్యాణం, ఆండాళమ్మ పూజలు ఈ మాసంలోనే నిర్వహిస్తారు. తిరుమలలో సుప్రభాతానికి బదులు తిరుప్పావై పాడతారంటే ఈ మాసానికి ఉన్న పవిత్రత ఎంతటిదో తెలుస్తున్నది. ఆలయాల్లో జరిగే ఆగమశాస్త్ర కైంకర్యాల్లో స్థానిక ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు కలిసిన అంశాల్లో ధనుర్మాసం ఒకటి. ఈ మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతోపాటు దరిద్రం దూరమవుతాయని పురాణాలు చెబుతున్నాయి.

**మార్గశిరం విశిష్టత..**

మార్గశిరం అంటే మార్గాల్లో శ్రేష్ఠమైనదని, మార్గంలో సాధనం అనగా ఉపాయాల్లో గొప్పది అని అర్థం. మార్గం అనగా కర్మయోగం, జ్ఞాన యోగం, భక్తి యోగం అని కూడా అంటారు. కార్తికేయుడు, కాలభైరవుడు, దత్తాత్రేయుడితోపాటు భగవద్గీత అవతరించింది కూడా ఈ మాసంలోనే కావడం విశేషం. మార్గశిర మాసం శ్రీకృష్ణ తత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ మాసం లక్ష్మీదేవిని, నారాయణుడిని తులసి దళాలతో పూజిస్తే సకల సంపదలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాక ఆధ్యాత్మిక భక్తి సంపదను పెట్టే ఉత్తమమైన కాలంగా ఈ మాసానికి ప్రత్యేకత ఉన్నది.

## ముస్తాబవుతున్న ఆలయాలు

ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుండడంతో వైష్ణవ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నెల రోజులపాటు శ్రీమహావిష్ణువుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శ్రీమహావిష్ణువు అవతారలైన శ్రీనరసింహ స్వామి, రంగనాథస్వామి తదితర ఆలయాల్లో ధనుర్మాస పూజలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రం గద్వాల కోటలోని భూలక్ష్మీ చెన్నకేశవ అలయం, బుర్ధాపేటలోని రంగనాథస్వామి ఆలయం, గంజిపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పెద్ద అగ్రహారంలోని లక్ష్మీ నరసింహస్వామి, భీంనగర్‌లోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి, నది అగ్రహారంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాన్నింటిలో నెల రోజులపాటు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- కనువిందు చేస్తున్న ఏక్లాస్‌పూర్ పార్కు
- రూ.2 కోట్లతో కను'బొమ్మలు' మెరిసేలా..
- 200 ఎకరాల 'ఆనంద'నవనంలో ఏర్పాటు
- పర్యాటకులను ఆకర్షించేలా కట్టడాలు


పార్కులో పర్యాటకులు వెళ్లేందుకు గ్రీనరీతో ఏర్పాటు చేసిన దారి



గొడుగు ఆకారం కింద ఏర్పాటు చేసిన బెంచీలు


పార్కులో ఏర్పాటు చేసిన జింకల బొమ్మలు


సేద తీరేందుకు ఇంటి ఆకారంలో నిర్మాణం..


పర్యాటకులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన అరుగు


రాతిపై వేసిన నెమలి బొమ్మ


కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

# అడవి ఒడిలో ఆహ్లాదం

నారాయణపేట, డిసెంబర్ 15 : చిన్నాపెద్ద తేడా లేకుండా పచ్చనిచెట్లు, ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు గత కేసీఆర్ సర్కారు ఎకో పార్కులను ఏర్పాటు చేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం అటవీశాతాన్ని పెంచడంతోపాటు పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు 2020లో ఏర్పాటు చేసిన ఎకో పార్క్‌లో చిన్నారుల ఆటవిడుపుతోపాటు వివిధ జంతువుల ఆకృతుల్లో ఏరాటు చేసిన బొమ్మలు చూపరులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. నారాయణపేట జిల్లాలో కేవలం 3శాతం అటవీ ప్రాంతం ఉంది. అందులో పట్టణానికి దగ్గరలో ఉన్న ఏక్లాస్‌పూర్-మినాస్‌పూర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎకో పార్క్ ఏర్పాటు చేస్తే ప్రజలకు అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో 2020లో పార్క్ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కృషితో శ్రీకారం చుట్టింది గత ప్రభుత్వం. ఏక్లాస్‌పూర్‌లో రూ.2కోట్లతో 200 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పార్క్‌ను మాజీ హోంశాఖ మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. జిల్లా కేంద్రం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏక్లాస్‌పూర్ వేంకటేశ్వరస్వామి (తిమ్మప్పస్వామి) ఆలయం వెనుక భాగంలో గల అటవీ ప్రాంతంలో పెద్ద గుట్టల మధ్యన ఎకో పార్క్‌ను నిర్మించారు. సందర్శకులను ఆకట్టుకునేలా రూ.2కోట్లతో పనులు చేపట్టారు.

**ఆహ్లాదం పంచేలా సదుపాయాలు..**

పిల్లల ఆట విడుపునకుతోడు చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆహ్లాదం పంచేందుకు పార్క్‌లో అన్ని సదుపాయాలు కల్పించారు. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో పచ్చనిచెట్ల మధ్యన సేద తీరేందుకు ప్రకృతి అందాలతో వేదికగా ఎకో పార్క్ మారింది. ప్రధాన గేటు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆర్చీ అందరినీ ఆకట్టుకునేలా రూపొందించారు. పార్క్‌లో సందర్శకులు, పర్యాటకులు విడిది చేయడానికి సిమెంట్ కూర్చీలను ఏర్పాటు చేశారు. పార్క్‌లో వాటర్ కన్జర్వేషన్, అవెన్యూ ప్లాంటేషన్, థీమ్ పార్క్, రాశి పార్క్‌లను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ మాదిరిగా నారాయణపేట జిల్లా ప్రజలకు ప్రకృతిని ఆస్వాదించేందుకు అన్ని సదుపాయాలను కల్పించారు.

- కొత్త దశలో ఆయిల్‌పాం తోటలు
- శ్రీరంగాపూర్ మండలం కంబాళాపురం శివారులో నాలుగెకరాల్లో 6 టన్నుల గెలలు
- టన్నుకు రూ.12 నుంచి రూ.14 వేల ధర
- కేసీఆర్ ప్రభుత్వ ప్రోత్సాహంతో సత్ఫలితాలు
- వనపర్తి జిల్లాలో 4,500 ఎకరాల్లో సాగు

# పంట పండింది

వనపర్తి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : మూస పద్ధతుల సాగుకు స్వస్తి పలికి నూతన వొరవడితో వ్యవసాయాన్ని నడిపించే దిశగా గత కేసీఆర్ సర్కారు అనేక ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. కొత్తగా సాగు చేసిన ఆయిల్‌పాం సాగు కాపుకొచ్చింది. ఆయిల్‌పాం ఇది వరకే సాగు చేసి లాభాలు గడిస్తున్న ఖమ్మంవంటి ప్రాంతాలకు వనపర్తి జిల్లాకు చెందిన వేలాది మంది రైతులను ఉచితంగా ప్రత్యేక బస్సుల ద్వారా తీసుకెళ్లి ఆయిల్‌పాం సాగుపై అధికారులు అవగాహన కల్పించారు. చివరకు రైతులు కూడా ఆసక్తి కనబరచడం, ప్రభుత్వం ప్రోత్సహించడంతో సాగు చేశారు. ఈ క్రమంలో ఇక్కడి ప్రధాన పంటలుగా ఉన్న వరి, వేరుశనగలకు ప్రత్యామ్నాయ పంటగా అయిల్‌పాంను రైతులు సాగు చేసే దిశగా చర్యలు తీసుకున్నారు. సాధారణ పంటలే కాకుండా వాణిజ్య పంటల వైపునకు రైతులను మళ్లించడంలో నాటి సర్కార్ సఫలీకృతమైంది. పశుపక్షాదుల నుంచి సులభంగా రక్షించుకునే వెసలుబాటు ఉన్న ఆయిల్‌పాం అనేక రకాలుగా రైతులకు ఊరటనిస్తున్నది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా చూస్తే వనపర్తి ప్రాంతంలోనే అత్యధికంగా ఆయిల్‌పాంను సాగు చేశారు. గత కేసీఆర్ సర్కారు అప్పటి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన పొలంలో ఆయిల్‌పాం సాగు చేసి భరోసాగా నిలవడంతో ఈ ప్రాంత రైతులు అదే బాట పట్టారు.

**జిల్లాలో 4,500 ఎకరాల్లో సాగు..**

జిల్లాలో 4,500 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు సాగయ్యాయి. గత ఏడాది 3వేల ఎకరాల్లో సాగవగా, ఈ ఏడాదిలో 1,200 ఎకరాలు, 2019-20లో పైలట్ ప్రాజెక్టు కింద మరో 250 ఎకరాలను సాగు చేశారు. జిల్లాలోని 14 మండలాల్లో 787 మంది రైతులు అయిల్‌పాంను సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ను బట్టి జిల్లా ఉద్యానశాఖ అధికారులు అయిల్‌పాం సాగుకు సహకారం అందిస్తున్నారు. మండల, గ్రామ స్థాయిలోనూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులను చైతన్యం చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. వరి, వేరుశనగ సాగుకంటే అధిక లాభసాటిగా ఉండే ఆయిల్‌పాంను చేపట్టేందుకు అవసరమైన చర్యలను ఉద్యానశాఖ తీసుకున్నది. సాంప్రదాయ పంటలకు రైతులను దూరం చేస్తూ వాణిజ్య పంటల సాగు వైపునకు సమాయత్తం చేయడం ద్వారా సాగు పెరుగుతున్నది.

**చేతికొచ్చిన పంట..**

చూస్తుండగానే ఆయిల్‌పాం పంట చేతికొచ్చింది. రైతుల అనుమానాలను పటాపంచలు చేస్తూ అనుకున్న రీతిలో ఆయిల్‌పాం గెలలు రైతుల్లో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ప్రస్తుతం చేతికి వచ్చిన పంటను ఖమ్మం ప్రాంతానికి తరలించి విక్రయాలు చేస్తున్నారు. స్థానికంగానే ఆయిల్‌పాం కర్మాగారాలను ఏర్పాటు చేసే దిశగానూ కేసీఆర్ సర్కారు చర్యలు తీసుకున్నది. ఈ మేరకు కొత్తకోట రోడ్డులో సంకిరెడ్డిపల్లి స్టేజీ సమీపంలో ఆయిల్‌పాం కంపెనీ ఏర్పాటుకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. శ్రీరంగాపురం మండలం కంబాలాపురంలో రైతు అనంతరెడ్డి నాలుగున్నర ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పాంలో పంటచేతికి రాగా, ఇటీవలే 6 టన్నుల వరకు వచ్చింది. వచ్చిన పంటను ఖమ్మం జిల్లాకు కంపెనీ యజమానులు రైతులకు ట్రాన్స్‌పోర్ట్ సమస్య లేకుండా తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.12 నుంచి రూ.14వేల వరకు గెలలకు ధరలు పలుకుతున్నాయి. మూడేండ్ల కిందట సాగు చేయగా, నాలుగవ ఏటనే పంట చేతికొచ్చింది. అయితే, పంట ఇప్పుడే మొదలైనందునా ఏ మేరకు దిగుబడులు, లాభనష్టాలు తెలియాలంటే మరి కొంత సమయం వేచి చూడాలి.



శ్రీరంగాపూర్ మండలం కంబాళాపురంలో ఆయిల్‌పాం సాగు


ఆయిల్‌పాం చెట్టుకు వచ్చిన గెలలు

**90శాతం సబ్సిడీతో..**

ఆయిల్‌పాం సాగుచేస్తున్న రైతులకు కేసీఆర్ సర్కార్‌లో 90శాతం మేర సబ్సిడీ ఇవ్వడంతో మక్కువ చూపారు. ఎకరాకు 50మొక్కల చొప్పున నాటే మొక్కలకు రైతులు ఒక మొక్కకు కేవలం రూ.20 మాత్రమే చెల్లించాలి. అయిల్‌పాం సాగులో అంతర పంటలను కూడా సాగు చేసుకునే వెసలుబాటు ఉన్నది. ఇలా నాటిన తోటలకు ఏడాదికి ఎకరాకు రూ.4,200 మెయింటనెన్స్ కోసం నాలుగేండ్లపాటు సర్కార్ ఇస్తుంది. సన్న, చిన్నకారు రైతులై ఉండి ఐదెకరాల్లోపు ఉన్న వారికే మాత్రమే ఇలా మెయింటనెన్స్‌తోపాటు డ్రిప్‌లోనూ 90శాతం వరకు సబ్సిడీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు కేవలం జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. ఇదిలా ఉంటే, పెద్ద రైతులకైనా మొక్కలను మాత్రం కేవలం రూ.20కే సర్కార్ అందిస్తున్నది. వీరికి డ్రిప్‌లో, మెయింటనెన్స్ కింద ఎలాంటి సహకారం అందదు.

### ఆరు టన్నుల గెలలు అమ్మినం..



నాలుగున్నర ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశాం. ఇంతకు ముందు వేరుశనగ పంట పండించేటోళ్లం. కేసీఆర్ సర్కారు రైతులను ఖమ్మం ప్రాంతానికి తీసుకెళ్లి పంట గురించి తెలుపడంతో మాకు నమ్మకం కలిగింది. మేం ఆయిల్‌పాం నాటి మూడేండ్లు అయ్యింది. 6టన్నుల వరకు పంట వచ్చింది. ప్రతి 15రోజులకు ఒకసారి గెలలు తెంపుతాం. మా ఊర్లో మొత్తం 14 మంది రైతులం సాగు చేశాం.

**- ఆనంద్‌రెడ్డి, రైతు, కంబాళాపురం, శ్రీరంగాపురం మండలం,వనపర్తి జిల్లా**

### ఐదెకరాల్లో సాగు చేశా..



ఐదెకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశా. 18 నెలలు కావస్తున్నది. అక్కడక్కడా పూత,పిందెలు వస్తున్నాయి. జూలై వస్తే మొత్తం కాపుకు వచ్చే అవకాశమున్నది. రెండేళ్లుగా అంతరపంటగా వేరుశనగ సాగుచేశా. అడవి పందులు, కోతుల బెడద ఆయిల్‌పాంకు లేదు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నందునా రైతులు సాగుకు ముందుకొస్తున్నరు.

**- పల్లా ధర్మారెడ్డి, వీపనగండ్ల, వనపర్తి జిల్లా**

### ఆయిల్‌పాంతో రైతులకు లాభాలు..



వరి, వేరుశనగ పంటలకంటే ఆయిల్‌పాంతో లాభాలు బాగుంటాయి. రైతులకు లాభసాటిగా ఉండటం వల్లే ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఎప్పుడూ ఒకే పద్ధతి పంటలు సాగు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆయిల్‌పాం తోటలకు కోతులు, అడవి పందుల బెడద కూడా ఉండదు. నీటి వసతి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకునే రైతులకు చాలా ఉపయోగకరం.

**- సురేశ్‌కుమార్, ఉద్యానశాఖ జిల్లా అధికారి, వనపర్తి**

- మార్కెట్‌లో క్వింటాకు రూ.25 వేల ధర
- ఎకరాకూ రూ.75 వేల ఆదాయం
- గతేడాదికంటే అధికంగా సాగు

# మిర్చి మిలమిల


ఊట్కూర్ మండలం పులిమామిడిలో ఆరబెట్టిన మిరప


పులిమామిడి శివారులో సాగు చేసిన మిరపపంట

ఊట్కూర్, డిసెంబర్ 15 : ఎండు మిర్చి సాగు రైతులకు మంచి లాభాలు తెచ్చిపెడుతున్నాయి. మండలంలో ఈఏడాది దాదాపు 500 ఎకరాల్లో రైతులు మిరప పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఆరుతడి పంటలైన వేరుశనగ స్థానంలో మిర్చిపంట సాగువైపు అధికంగా రైతులు మొగ్గు చూపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎండు మిరపకు మంచి ధర ఉండడంతో బోరుబావుల ఆధారంగా మిర్చిపంటను పండించారు. ఊట్కూరు మండలకేంద్రంతోపాటు పులిమామిడి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, తిప్రాస్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, మొగ్దుంపూర్, అవుసలోనిపల్లి గ్రామాల్లో 500 ఎకరాల్లో సాగు చేసిన మిరప పంట ప్రస్తుతం లాభాలు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఎండు మిరప క్వింటాకు రూ.23వేల నుంచి రూ.25వేల వరకు ధర పలుకుతున్నది. రైతులు పండించిన ఎండు మిర్చిని ఖమ్మం, కర్నూల్, గుంటూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఎకరా పంట సాగుకు మిరప నారు, మందులు, ఎరువుల కొనుగోలు, కలుపు తీత పనులకు మొత్తం కలిపి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి అవుతోంది. పెట్టుబడులు పోను రైతుకు ఎకరాకు రూ.75వేల వరకు ఆదాయం వచ్చినట్లు చెబుతున్నారు.

# కొత్తకొత్తగా అదనపు కలెక్టర్లు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 15 : మహబూబ్‌నగర్‌కు అదనపు కలెక్టర్‌గా శివేందర్‌ప్రతాప్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం డీఆర్‌డీవో పీడీ యాదయ్య స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శివేందర్‌ప్రతాప్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు. డీఆర్‌డీవో జిల్లా అధికారిగా యాదయ్య యథావిధిగా విధులు నిర్వహించనున్నారు.

**వనపర్తి అదనపు కలెక్టర్‌గా సంచిత్ గంగ్‌వార్..**

వనపర్తి, డిసెంబర్ 15: జిల్లాకు మరోఅదనపు లోకల్ బాడీ కలెక్టర్‌గా సంచిత్ గంగ్‌వార్ బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా ఉన్నత అధికారుల సమాచారం. 2021 బ్యాచ్ ఐఏఎస్ కు చెందిన గాంగ్‌వార్‌ను వనపర్తి జిల్లాకు అదనపు లోకల్ బాడీ కలెక్టర్‌గా నియమితులయ్యారు.